సాక్షి
జగిత్యాల

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



జగిత్యాల రూరల్: పాలాసలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ధర్మపురి: మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ధర్మపురి: మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



గొల్లపల్లి: దేవతలను వనంలోకి తీసుకెళ్తున్న కోయ పూజారి



ధర్మపురి: మేడారంలో ప్రభుత్వ విప్ తులాభారం

అమ్మల వనప్రవేశం

ధర్మపురి/జగిత్యాలరూరల్/గొల్లపల్లి: అమ్మల వనప్రవేశంతో సమ్మక్క, సారలమ్మ జాతర ముగిసింది. ధర్మపురిలోని మోరోల్ల వాగు వద్ద కమిటీ చైర్మన్ ఒల్లెపు శంకర్‌రాజు, నర్సంపేటకు చెందిన పూజారి వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర చివరిరోజు మేళతాళాల మధ్య అమ్మలను వనాలకు తరలించారు. భక్తులు కోళ్లు, మేకలు, బంగారం మొక్కులు చెల్లించారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట వద్ద కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ జాతర ముగిసింది. కోయ పూజారి కోరెం లక్ష్మణ్ అమ్మవార్లను డప్పుచప్పుళ్ల మధ్య వనంలోకి తీసుకెళ్లారు. జాతర కమిటీ అధ్యక్షుడు గండె భాస్కర్, ఉపాధ్యక్షుడు చేని రాములు, గండం పరంధాములు, అల్లాడి వెంకన్న, అల్లాడి సత్తయ్య, సాంబయ్య, కట్కూరి రమేశ్, అత్తె రాజయ్య, పల్లెర్ల రవి, రాజేందర్ పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో అమ్మవార్లను భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు.

3 ఎకరాలు.. 14 పంటలు



సండే స్పెషల్

వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలు కాకుండా వినూత్నంగా సాగుచేస్తున్నాడు సిరిసిల్ల శివారులోని పెద్దబోనాలకు చెందిన రైతు బాలరాజు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయలు సాగుచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాడు. తన మూడెకరాలలో 14 రకాల కూరగాయలను సాగుచేస్తూ సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటున్నాడు. ఇలా తనతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నాన్న బాటలో పయనిస్తున్న కూరగాయల రైతు బాలరాజు. ఈ యువరైతు సక్సెస్ స్టోరీ ఈ సండే స్పెషల్.. – వివరాలు 8లో..

న్యూస్‌రీల్

వైద్య కళాశాల పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం మెడికల్ కళాశాల పనులను పరిశీలించారు. కళాశాలతోపాటు, బాల, బాలికల వసతి గృహాల పనులు వెంటనే పూర్తి చేయాలని ఇంజినీర్లు, అధికారులను ఆదేశించారు. అవసరమైన ముడి సరుకులను తెప్పించుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్‌రావు, జగిత్యాల బల్దియా కమిషనర్ అనిల్‌బాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యం

మల్లాపూర్: ఆయిల్‌పామ్ సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. మండలకేంద్రంలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 4,300 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వేంపల్లి, రాఘవపేట, మొగిలిపేటలో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఏవో లావణ్య, ఏఈవో గజానంద్ ఉన్నారు.

నేటి నుంచి టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్ష

జగిత్యాల: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులో భాగంగా లోయర్, హయ్యర్‌గ్రేడ్ గల టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలను ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 25న లోయర్ గ్రేడ్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, 26, 27న టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్‌గ్రేడ్ పరీక్షను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. తిరిగి మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ధర్మపురి రోడ్‌లోని సూర్య హైస్కూల్, వాణీనగర్‌లో గల రామకృష్ణ హైస్కూల్‌లో పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు పొందాలని సూచించారు.

ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేయండి

రాయికల్: జిల్లాలోని మేడిపల్లి మండలం తొంబర్రావుపేట నుంచి డి–52 కాలువకు తూము ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శనివారం ఎస్సారెస్పీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. తూము మూసి ఉండటం ద్వారా చెరువు ఎండిపోయి రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తూము ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు.

అధికారి రూటేవేరు

- రెవెన్యూ విభాగంలో ఆరోపణల వెల్లువ
- సరెండర్ చేయాలని కౌన్సిలర్ల సంతకాల సేకరణ
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన కౌన్సిలర్లు

జగిత్యాల: పాలనలో రెవెన్యూ విభాగం అతిముఖ్యమైనది. ఈ విభాగంతో ప్రజలకు అనేక సంబంధాలుంటాయి. ముఖ్యంగా అసెస్మెంట్‌కు సంబంధించిన పనులు, ఇంటి నంబర్ల మార్పు, మ్యూటేషన్లు.. ఇలా అనేక పనులు జరుగుతాయి. అలాంటి ఈ విభాగంలో జగిత్యాలలో పనిచేస్తున్న ఓ అధికారి అమ్మమ్యాలిస్తేనే పనులు చేస్తున్నారని సదరు అధికారిపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. మ్యూటేషన్, ఆస్తిమార్పిడి, ఇంటి నంబర్లకు ప్రతిదానికీ ఓ రేటు విధించి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ధ్రువీకరణ పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా.. ఏదో ఒక లోపం సృష్టించి రోజుల తరబడి తిప్పుతూ ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నట్లు సమాచారం. కుటుంబంలో పెద్ద చనిపోయినప్పుడు అతని పేరున ఇల్లు, ఇతర ఆస్తులను ఆయన కుమారులు లేదా భార్య పేర మార్పిడికి.. ఇంటినంబర్ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. పనులు చేయాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఏకంగా బల్దియా కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓ వార్డు కౌన్సిలర్ ద్వారా మ్యూటేషన్ కోసం ఆ వార్డులోని ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. ఆ పని చేయకపోగా.. అందులో లోపాలున్నాయంటూ ఫైల్‌ను ముందుకు కదపకుండా ఉంచడంతో కౌన్సిలర్, అధికారుల మధ్య గొడవ కూడా చోటుచేసుకున్నట్లు తెలిసింది. కాగిత్యాల సక్రమంగా ఉన్నా ఎందుకు చేయడం లేదని సదరు అధికారిని కౌన్సిలర్ ప్రశ్నించినట్లు తెలిసింది. అయినా సంబంధిత అధికారి ఏమీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

అంతా అవినీతిమయం

మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో లంచాలు తీసుకుంటూ గతంలో టీపీవో రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ విభాగంలో అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా రెవెన్యూ విభాగంలోనూ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ అధికారులపై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

సంతకాల సేకరణ

రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న సదరు అధికారిని సరెండర్ చేయాలని ఓ వార్డు కౌన్సిలర్ అందరు కౌన్సిలర్లతో సంతకాలు సేకరించారు. ఇందులో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 30 మంది, కాంగ్రెస్, బీజేపీతోపాటు ఇతర పార్టీల కౌన్సిలర్లు, స్వతంత్రులు కూడా సంతకాలు చేసినట్లు తెలిసింది. ఈ సంతకాలు సేకరించిన కాపీని కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరెండర్ చేసే అధికారం తమకు లేదని చెప్పినట్లు తెలిసింది. ఈనెల 28న చైర్‌పర్సన్ ఎలక్షన్ ఉన్న నేపథ్యంలో కౌన్సిలర్లు అందరూ క్యాంప్‌నకు వెళ్లడంతో వచ్చిన తర్వాత అందరూ కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మార్చి 30 ఆర్థిక సంవత్సరం గడువు ముగింపు. ఈ నేపథ్యంలో కమిషనర్లకు ఆస్తిపన్ను టార్గెట్ ఉంటుంది. ప్రస్తుతం అందులో పనిచేస్తున్న అధికారిని సరెండర్ చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే ప్రక్రియను అడ్డుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సరెండర్ చేయాలని కౌన్సిలర్లు తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నప్పటికీ అధికారం లేదంటూ కమిషనర్ పేర్కొన్నట్లు తెలిసింది. డెప్యూటేషన్‌పై వచ్చిన ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఇటీవల కమిషనర్ సీడీఎంఏకు సరెండర్ చేశారు. అతన్ని చేసినప్పుడు ఇతన్ని కూడా ఎందుకు చేయరాదు.. అని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఆ అధికారికి కొందరు కొమ్ము కాస్తున్నట్లు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

విచారణ చేపడతాం



రెవెన్యూ విభాగంలోని ఓ అధికారిపై కౌన్సిలర్లు ఫిర్యాదు చేయడం దృష్టికి వచ్చింది. పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం. ప్రస్తుతం సరెండర్ చేసే అధికారం నా పరిధిలో లేదు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూస్తాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

కొండగట్టులో జిల్లా జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారిని శనివారం జిల్లా జడ్జి నీలిమ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందించారు.

కిక్కిరిసిన జనం



జగిత్యాల బస్టాండ్‌లో కిక్కిరిసిన జనం

జగిత్యాల: సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా చాలావరకు బస్సు సర్వీసులను మేడారానికి నడిపిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు సర్వీసులు లేక నానాతంటాలు పడ్డారు. శనివారం జగిత్యాల బస్టాండ్ మొత్తం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. కనీసం కూర్చుందామన్నా స్థలం లేని పరిస్థితి నెలకొంది. తాగునీటికి ఇబ్బంది పడ్డారు. కనీసం కూర్చునేందుకూ స్థలం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: అర్హులైన ప్రతిఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. 18 ఏళ్లు నిండిన వారి పేర్లను ఓటరుగా నమోదు చేయించాలని, గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంబాసిడర్ల కృషితో 0.86 శాతం నుంచి 3.85 శాతం యువత పేర్లు నమోదు చేసుకుందని పేర్కొన్నారు. దానిని 4శాతం వరకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. యువత ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా మంచి వ్యక్తికి ఓటు వేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలోని 28 డిగ్రీ, 75 జూనియర్ కళాశాలలు, 6 ప్రొఫెషనల్ కళాశాలలో అంబాసిడర్లను నియమించామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, స్వీప్ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం



మాట్లాడుతున్న ఎస్‌ఈ రవీందర్

ధర్మపురి: రానున్న వేసవిలో ధర్మపురి మండల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఎస్‌ఈ రవీందర్ అన్నారు. మండలంలోని కమలాపూర్ బోల్‌చెరువు నీటిమట్టాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ధర్మపురిలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, డబ్బా గ్రామం నుంచి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు వేసవిలో అందకుంటే బోల్‌చెరువు ద్వారా నీరందిస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్ చొరవతో చెరువును నింపేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు, చిన్నచిన్న మరమ్మతులను గుర్తించి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఈఈ శేఖర్‌రెడ్డి, ఏఈలు రాహుల్, రోహిత్ తదితరులున్నారు.

బీర్‌పూర్ నృసింహుడికి డోలోత్సవం



సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి శనివారం రాత్రి డోలోత్సవం నిర్వహించారు. స్వామి వారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో ఊపారు. కోనేరులో తెప్పపై విహరింపజేశారు. ఉదయం ఉత్సవ విగ్రహాలను చందనంతో అలంకరించారు. ఆలయ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా స్వామివార్లను దర్శించుకున్నారు.

రాయికల్‌లో కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్

- విద్యార్థినులకు అసభ్య వీడియోలు చూపిన వైనం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు
- సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ



సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

రాయికల్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థినులకు సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ ద్వారా అసభ్య వీడియోలు చూపుతూ.. అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినుల ఫిర్యాదుతో సదరు ఉపాధ్యాయుడిని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 13న ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. రాయికల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జే.శ్రీనివాస్ లంచ్ టైం, పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థినులకు సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ ద్వారా అసభ్యకరమైన వీడియోలు చూపిస్తుండటంతో విద్యార్థినులు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని హెచ్‌ఎం డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 7న ఏడీ శివకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా సదరు ఉపాధ్యాయుడు చేసిన వికృతచేష్టలు వెలుగుచూశాయి. దీంతో స్పందించిన డీఈవో జగన్మోహన్‌రెడ్డి సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీ ఎన్నికల కోసమే బీజేపీ సీబీఐ డ్రామా

- జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత



జగిత్యాలరూరల్: ఎంపీ ఎన్నికల్లో గెలుపు కోసమే బీజేపీ సీబీఐ డ్రామా ఆడుతోందని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితను రాజకీయంగా బద్నాం చేసి బీజేపీ లబ్ధిపొందేందుకే కవితపై సీబీఐని ఉసిగొల్పుతోందని పేర్కొన్నారు. బెదిరింపులు బీఆర్‌ఎస్‌కు కొత్త కాదని, ధైర్యమే తమ ఆయుధమన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో బీజేపీ కవితపై సీబీఐ విచారణ పేరిట డ్రామాలు మొదలుపెట్టిందని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణలో గెలిచే పరిస్థితి లేదని గుర్తించి.. కవితపై రాజకీయ కుట్రకు తెరలేపారన్నారు. లేని లిక్కర్ స్కాం పేరుతో ఇప్పటికే పలుమార్లు ఇబ్బంది పెట్టిన బీజేపీ.. ఎన్నికల తరుణంలో మరోసారి ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు.





అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నను శనివారం భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మ జాతర చివరి రోజు కావడం.. సమీపంలోని జాతర, మేడారం వెళ్లే భక్తులతో ఆలయంపై మామూలు రద్దీ కొనసాగింది. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

మల్యాల ప్యాక్స్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



అవిశ్వాసానికి మద్దతు తెలిపిన డైరెక్టర్లు

మల్యాల: మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. శనివారం ప్యాక్స్ కార్యాలయంలో జిల్లా సహకార సంఘం అధికారి ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30గంటల వరకూ సభ్యులెవరూ హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారి ప్రకటించారు. సహకార సంఘంలో చైర్మన్‌తోపాటు 13 మంది సభ్యులున్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు 9మంది డైరెక్టర్ల మద్దతు అవసరం. అయితే 8మంది సభ్యులు మ్యాక బుజ్జమ్మ, సంత ప్రకాశ్‌రెడ్డి, అడువాల సురేశ్, నేళ్ల అరుణ, ఓరుగంటి రాజేందర్, యాళ్ల అనంతరెడ్డి, బట్టు విజయానంద్, ఉత్తురి తిరుమలేశ్ మాత్రమే అవిశ్వాసానికి మద్దతుగా నిలిచారు. ప్యాక్స్ చైర్మన్ రాంలింగారెడ్డికి అండగా డైరెక్టర్లు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల నగేశ్, గడ్డం రాజేశం, అడువాల జగదీశ్వర్ నిలిచారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం





మల్లాపూర్: మండలంలో రత్నాపూర్‌లోగల మల్లికార్జునస్వామి కల్యాణాన్ని అర్చకులు కుడకల శివకుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పడుకుని స్వామివారికి స్వాగతం పలికారు. ఉత్సవ విగ్రహాలను భక్తులపై నుంచి నడుచుకుంటూ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపు నిర్వహించారు. ఇంటికొకరు చొప్పున మహిళలు బోనాలతో మల్లన్న ఆలయానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవ సురేష్, ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ సర్పంచ్‌లు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ప్రైవేట్ కళాశాల లెక్చరర్‌పై కేసు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థిని తీవ్రంగా కొట్టిన కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ లెక్చరర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. విద్యార్థి తండ్రి నబీషరీఫ్ ఫిర్యాదు మేరకు ఈచర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇది ఇలాఉంటే విద్యార్థిపై చేయిచేసుకున్న అధ్యాపకుడిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు విద్యాసంస్థల చైర్మన్ తెలిపారు.

గ్యాస్ లీకేజీతో మంటలు


నిరాశ్రయులైనకుటుంబం

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం గ్యాస్ లీకేజీ తో మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన దేవునూరి పోచమ్మ వంట చేసేందుకు గ్యాస్ స్టౌవ్ వెలిగించగాగ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. పోచమ్మ కుమారుడు శ్రీనివా స్ కశ్రసాయంతో సిలిండర్‌ను బయటకు లాగేయడంతో పెద్దప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంతో పోచమ్మ కుటుంబం రోడ్డునపడింది. రూ.30వేల ఆస్తినష్టం వాటిల్లిందని వాపోయింది.

పట్టుబడిన దొంగ

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని శాంతినగర్‌లో అడ్డగట్ల మురళీ ఇంట్లో ఈనెల 13న దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులు ఇంటిలో దొంగతనం చేసిన దొంగను శనివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. స్థానిక శాంతినగర్‌లో నివసించే అడ్డగట్ల మురళీ విహారయాత్రకు వెళ్లగా ఈనెల 13న చోరీ జరిగింది. బాధితులు ఇంటి కొచ్చిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇంటిలో అద్దెకు ఉంటున్న రాజేంద్రప్రసాద్ దొంగతనానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీని ఆధారంగా పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేయగా అతని నుంచి మురళీ ఇంటిలో దొంగలించిన బంగారు నగలు, కొంత నగదును రికవరీ చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు.

ఎల్ఎండీలో దూకి మహిళ ఆత్మహత్య

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్‌కు చెందిన నందిని(48) లోయర్ మానేరు డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాలు... కొన్నిరోజులుగా నందిని మానసిక సమస్యతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు చికిత్స చేయించినా ఆరోగ్యం మెరుగుపడలేదు. మనస్తాపం చెందిన ఆమె చనిపోతానంటూ తరచూ కుటుంబ సభ్యులకు చెప్పేది. ఈనెల 22న మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎల్ఎండీ వద్ద వెంట తెచ్చుకున్న ఫినాయిల్ తాగి జలాశయంలోకి దూకింది. మృతదేహం శనివారం బయటకు తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నందిని భర్త కోడెం రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

3 ఎకరాలు.. 14 పంటలు

- కలగూరగంప.. ఆ వ్యవసాయక్షేత్రం
- మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి పంటల సాగు
- నలుగురికి ఉపాధినిస్తున్న బాలరాజు
- వ్యవ'సాయం'లో నేత కుటుంబం

సండే స్పెషల్

సిరిసిల్ల: నేతన్న కుటుంబంలో పుట్టిన బాలరాజు.. కులవృత్తి వైపు వెల్లకుండా పంటల సాగుపై దృష్టి పెట్టాడు. తండ్రిని చూస్తూ పెరిగిన బాలరాజు.. నాన్న చూపిన బాటలోనే పయనిస్తున్నాడు. సాంప్రదాయ పంటలను సాగు చేయకుండా కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాలలో 14 రకాల కూరగాయలు సాగుచేస్తూ ఆర్థికంగానిలదొక్కుకుంటున్నాడు. తనతోపాటు మరికొందరికి ఉపాధి చూపుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.




పెద్దబోనాలలో బాలరాజు సాగు చేసిన వివిధ రకాల కూరగాయల పంటలు

నాన్నే స్ఫూర్తి



మా నాన్న చంద్రయ్యనే స్ఫూర్తి. ఆయన 25 ఏళ్ల కిందటే అనేక రకాల పంటలు పండించాడు. ఇప్పుడు అదే భూమిలో కూరగాయలు పండించడం, మార్కెట్లో అమ్ముకోవడంతో వ్యాపారం బాగుంది. ఇది నాన్న చూపిన బాటనే. సీజన్‌లో నెలకు అన్ని ఖర్చులు పోను రూ.50వేల వరకు వస్తాయి. ఇప్పుడు రూ.30 వేలు వస్తున్నాయి. కాలానుగుణంగా అన్ని కూరగాయలను సాగుచేస్తాను. మార్కెట్‌లో డిమాండ్ ఉంటే ఎక్కువ గిట్టుబాటు అవుతుంది. లేకుంటే తక్కువ వస్తాయి. ఒకే పంటను నమ్ముకొని నష్టపోయేకంటే చాలా రకాలు వేసుకుంటే మంచిది. ఒకదాంట్లో నష్టం వచ్చినా మరో పంటలో కలిసివస్తుంది. ఇప్పటికైతే వ్యాపారానికి ఢోకా లేదు.
– దొంతుల బాలరాజు, పెద్దబోనాల

తండ్రి బాటలో.. సాగుపై ఆసక్తితో..

సిరిసిల్ల శివారులోని పెద్దబోనాలకు చెందిన దొంతుల బాలరాజుది నేతకార్మిక కుటుంబం. వాళ్ల తాతలు మగ్గం నేసేవారు. వస్త్రపరిశ్రమలో బతుకుదెరువు లేదని గ్రహించిన బాలరాజు తండ్రి చంద్రయ్య వ్యవసాయం చేశాడు. తండ్రి బాటలో పయనిస్తూ కూరగాయలు సాగుచేస్తున్నాడు. అందరు రైతుల్లాగా.. బోర్లు వేయకుండా.. బావి నీటితోనే కూరగాయలను పండిస్తున్నాడు.



చదివింది ఐదో తరగతి

బాలరాజు ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తనకున్న మూడెకరాల ఎర్రభూమిలో పుదీన, క్యాబేజీ, టమాట, వంకాయ, మిర్చి, పచ్చకూర, పాలకూర, తోటకూర, కొత్తిమీర, మెంతి, కరివేపాకు, జామ, మామిడి, నిమ్మ చెట్లను సాగు చేస్తున్నాడు. ఒక్కో పంటను రెండు నుంచి ఐదు గుంటల విస్తీర్ణంలో వేస్తాడు. ప్రస్తుతం 14 రకాల పంటలు ఉండగా.. సీజన్‌లో 20 రకాల కూరగాయలు సాగు చేస్తాడు. కాలానుగుణంగా పంటలను మార్చుతూ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఆయా పంటలను వేసుకుంటున్నాడు. పట్టుదలే పెట్టుబడిగా వ్యవసాయంలో నిమగ్నమైన బాలరాజు నిత్యం వ్యవసాయ క్షేత్రంలోనే తల్లి, భార్యతో కలిసి శ్రమిస్తున్నాడు. భూసారాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ ఎరువులను వేస్తున్నాడు. నిత్యం తన పొలంలో ఓ నలుగురు కూలీలకు పని కల్పిస్తున్నాడు. తన పొలంలోనే ప్రయోగాలు చేస్తూ.. కలగూరగంపలా వ్యవసాయక్షేత్రాన్ని మార్చాడు.

సిరిసిల్ల మార్కెట్‌లో వ్యాపారం

తాను పండించిన కూరగాయలు, పంటలను సిరిసిల్ల మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ట్రాలీ ఆటో కొని.. హోల్‌సేల్‌గా ఫంక్షన్లకు సరఫరా చేస్తాడు. సిరిసిల్ల ప్రాంతంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలకు సైతం కూరగాయలు సరఫరా చేస్తున్నాడు. ఏ సీజన్‌లో ఏ పంటకు గిరాకీ ఉంటుందో అవగాహన ఉన్న బాలరాజు ఆయా పంటలనే సాగు చేస్తుంటాడు. ముందస్తు ప్రణాళికతో మూడెకరాల్లో పంటను మార్చుతూ పండిస్తుంటాడు. అందరిలా వరి పంట సాగు చేయడు. తనకున్న మరో రెండు ఎకరాలను ఓ డాక్టర్‌కు కౌలుకు ఇచ్చాడు. అందులో డ్రాగన్ పంటను ఆ డాక్టర్ సాగు చేయడం విశేషం. మొత్తంగా బాలరాజు ఐదెరాలు ఉండగా.. మూడు ఎకరాల్లోనూ 14 రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు.

గ్రామీణ పాడి రైతులను ఆదుకుంటాం

- ఎస్ఆర్‌కే డెయిరీ వ్యవస్థాపకుడు బండారి మారుతి
- వెంకటేశ్వరపల్లిలో డెయిరీ ప్రారంభం

జమ్మికుంట: గ్రామీణ ప్రాంత పాడి రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా, అందుబాటులో ఉంటూ పాల సేకరణ, రుణ సాయంతో ఆదుకుంటామని ఎస్ఆర్‌కే (శివరామకృష్ణ) పాల డైయిరీ వ్యవస్థాపకుడు బండారి మారుతి అన్నారు. శనివారం మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ. 22 కోట్ల వ్యయంతో అత్యాధునికి యంత్ర సామగ్రితో కూడిన డైయిరీని బండారి మారుతి, కూమార్తె శివాత్మిక, కుమారుడు శివరామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ తరహాలో డైయిరీ ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకి గేదెలు, ఆవులు కొనుగోలు చేసుకోవడానికి, పాలు డైయిరీలో అమ్ముకునే విధంగా లక్షా ముప్పైవేల లీటర్ల పాలను ఉత్పత్తి లక్ష్యంగా డైయిరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు, అత్యధిక క్వాలిటీతో తక్కువ ధరలకు పాల ఉత్పత్తుల అమ్మకంతో వినియోగదారులకు అందుబాటులో ఉంటామన్నారు. అంతేకాకుండా తెలంగాణ టీ సంస్థలను ఏర్పాటు చేసి పని చేస్తున్న ఉద్యోగులను సంస్థలో భాగస్వాములుగా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, రాష్ట్ర రైస్ మిల్ ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు నరసింహరావు, మండల అధ్యక్షుడు రాజమౌళి, సీఈవో కృష్ణారావు, ఏజీఎం భాస్కర్, జీఎం మధు, ఆర్ఎం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డైరీ వ్యవస్థాపకులు బండారి మారుతి

కాంగ్రెస్ ప్రజలకు చేస్తుందేమీ లేదు

- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తుందేమీ లేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం పేరు చెప్పి రూ.లక్షన్నర కోట్లు మింగితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజలకు ఫ్రీ బస్సు తప్ప ఏమీ ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడేమో 17 ఎంపీ సీట్లు గెలిస్తే తప్ప గ్యారంటీలు ఇవ్వమని ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తోందన్నారు. దేశం కోసం పనిచేసే నాయకుడు కావాలా, దేశాన్ని దివాలాతీసే నాయకులు కావాలా ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి మద్దతుగా నిలిచి, బీజేపీని గెలిపించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ప్రభారి కొప్పు బాషా, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నాయకులు రావుల రామ్‌నాథ్, బొడిగె శోభక్క, ఎస్.కుమార్, బల్మూరి వనిత, మెరుగు హనుమంతుగౌడ్, వడ్డేపల్లి రాంచందర్, రావుల రాజేందర్, క్యాతం వెంకటరమణ, అయోధ్య రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

- మరో వ్యక్తి పరిస్థితి విషమం

గొల్లపల్లి : ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓరగంటి లచ్చయ్య (62) దినసరి కూలీ. రోజూలాగే కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. చిల్వాకోడూర్ వంతెన సమీపంలో ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన పెద్ది రమేశ్ బైక్‌పై వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో లచ్చయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్ బైక్‌తోపాటు వంతెనపై నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించారు. లచ్చయ్య కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.


లచ్చయ్య మృతదేహం


గాయపడిన పెద్ది రమేశ్


నుజ్జునుజ్జయిన బైక్

కాకిని బలిచ్చి, హుండీల చోరీ

- దొంగతుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘటన

ధర్మారం(ధర్మపురి): కాకిని బలిచ్చి, హుండీలు చోరీ చేసిన ఘటన ధర్మారం మండలంలోని దొంగతుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోటుచేసుకుంది. ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈ నెల 19న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత సమ్మక్క–సారలమ్మ జాతర ఉండటంతో గుడికి తాళం వేసి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామిలకు సంబంధించిన రెండు హుండీలను లెక్కించకుండానే గర్భగుడిలో ఉంచారు. ఇది తెలుసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఆలయం ఎదుట కాకిని బలిచ్చి, ప్రవేశద్వారం, గర్భగుడి తాళాలు పగులగొట్టి, హుండీలను ఎత్తుకెళ్లారు. వాటిలో దాదాపు రూ.20 వేలు ఉన్నాయి. దుండగులు స్వామివారి బంగారు, వెండి ఆభరణాలను మాత్రం ముట్టుకోలేదు. శనివారం సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారు. శునకాలను ఆలయంలో వదలగా అక్కడి నుంచి మెయిన్ రోడ్డు వరకు వెళ్లి, ఆగినట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

హామీలను విస్మరిస్తే ప్రజలు సహించరు

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఫైర్
- కొత్త పథకాల అమలుకు జీవో జారీ చేయాలని డిమాండ్

కథలాపూర్(వేములవాడ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను త్వరగా అమలు చేయాలని, ఎన్నికల కోడ్ పేరిట విస్మరించాలని చూస్తే ప్రజలు సహించబోరని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో విలేకరులతో మాట్లాడారు. మహాలక్ష్మి గ్యారంటీలో మూడు పథకాలు ఉన్నాయని.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేసి ఒక్క హామీ పూర్తిగా అమలు చేసినట్లు సీఎం చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మహాలక్ష్మి గ్యారంటీలోనే రూ.500కు వంటగ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకూ రూ.2500 అందించే పథకాలు ఉన్నాయనే విషయాన్ని సీఎం గుర్తించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కోటి ఎకరాల్లో రైతులు వరి, ఇతర పంటలు సాగుచేయడంతో భూములు పచ్చదనంతో కళకళలాడాయని, ఇప్పుడు సరిగా సాగునీరందక సగం భూములు బీడుగా కనిపిస్తున్నాయని తెలిపారు. నెలరోజుల్లో వరి పంట చేతికొస్తుందని, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఎప్పుడిస్తారో తేల్చి జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు డబ్బులు మూడెకరాల వరకే ఇచ్చారని.. మిగతావారికి ఇవ్వడంతోపాటు రూ.2లక్షల రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. మార్చి 13వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని, మహాలక్ష్మి గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తే ప్రజలు బుద్ధి చెప్తుతారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, నాగేశ్వర్‌రావు, గుండారపు గంగాధర్ శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు చల్మెడ లక్ష్మీనరసింహారావు, బాపురెడ్డి

రాజన్నను దర్శించుకున్న ముక్కామల క్షేత్ర పీఠాధిపతి


శ్రీధర్ స్వామీజీకి పూర్ణకుంభ కలశంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ: రాజన్నను ముక్కామల క్షేత్ర పీఠాధిపతి శ్రీధర్‌స్వామీజీ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ కలశంతో స్వాగతం పలికారు. నాయకులు కట్కూరి శ్రీనివాస్, నగుబోతు రవీందర్ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ఢిల్లీ సైబర్ క్రైం డీసీపీ పూజలు


డీసీపీ గౌతం కుమార్‌ను కలిసిన మల్యాల సీఐ, ఎస్సై

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో న్యూఢిల్లీలో సైబర్ క్రైం బ్రాంచ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న కండ్లె గౌతంకుమార్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గౌతం కుమార్ స్వగ్రామం మానాల. లక్ష్మీనర్సింహాస్వామి జాతర సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన ఆయన లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పూజలు చేశారు. జాతరలో పాల్గొన్నారు. డీసీపీని మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై అబ్దుల్ రహీం ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ప్రమాదవశాత్తు వలసకార్మికుడి మృతి


సుమిత్ చౌదరి మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం సుద్దాలలోని ఓ పత్తిమిల్లులో ప్రమాదవశాత్తు కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు. బిహార్ రాష్ట్రంలోని జమాలాబాద్‌కు చెందిన సుమిత్ చౌదరి(20) కోనరావుపేట మండలంలోని సుద్దాల శివారులోని పత్తిమిల్లులో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం చందన్‌కుమార్ అనే కార్మికుడు ట్రాక్టర్ క్రేన్‌కు డోజర్ వేసుకునేందుకు మిల్లు నుంచి బయటకు తీస్తుండగా సుమిత్ చౌదరికి వాహనం తాకడంతో ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని సీఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుని సోదరుడు అజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నాగరాజు (ఫైల్)

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన బత్తిని నాగరాజు (25) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. నాగరాజు తన స్నేహితుడైన మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన సిరిపురం చరణ్‌తో కలిసి ఈనెల 20న ఉప్పుమడుగు నుంచి ద్విచక్రవాహనంపై రాయికల్ వస్తున్నారు. అయోధ్య శివారులోకి రాగానే వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. వెంటనే బంధువులు వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. నాగరాజును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గంమధ్యలో మృతిచెందాడు. నాగరాజు తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నాగరాజు ఇటీవలే దుబాయ్ నుంచి వచ్చాడు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

రైతులపై కాల్పులు హేయమైన చర్య

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రం కాల్పులు జరిపించడం హేయమైన చర్య అని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న ప్రధాని మోదీ ప్రభుత్వం రైతులు కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదా అని ప్రశ్నించారు. రైతు వెన్నులో తూటాలు దించిన కేంద్ర సర్కారుకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. యువ రైతు మృతికి కేంద్రమే బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్, బుచ్చన్న, రవి కుమార్, రాజేశం, కె.రాజేశం, వసంత్, మహేందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.